క్లుప్తంగా

ఎస్సై సందీప్‌కు సన్మానం



సందీప్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్/ఇల్లెందు: ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్‌–1 ఫలితాల్లో ఇల్లెందు ఎస్సై సందీప్ 502 మార్కులను సాధించినందుకు ఎస్పీ రోహిత్‌రాజు ఘనంగా సన్మానించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్‌రాజును ఇల్లెందు ఎస్సై సందీప్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఎస్సైగా విధులు నిర్వహిస్తూనే గ్రూప్‌–1 పరీక్షల్లో ప్రతిభను చాటడం అభినందనీయమన్నారు.

ట్రైకార్ రుణాలు మంజూరు చేయండి



ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: గతంలో మంజూరు చేసిన లబ్ధిదారులకు, కొత్తగా అందజేసే ట్రైకార్ దరఖాస్తుదారులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీఓ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. వజ్జ సురేష్, కొడెం బోస్, కోలా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వస్తువులు కొంటే రశీదు పొందండి..



మాట్లాడుతున్న న్యాయమూర్తి కీర్తిచంద్రికారెడ్డి

ఇల్లెందు: వినియోగదారులు తాము కొనుగోలు చేసే ప్రతీ వస్తువుకు తప్పకుండా రశీదు పొందాలని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రికారెడ్డి తెలిపారు. బుధవారం ఇల్లెందు ఎస్ఎంఎస్ బాలికల గిరిజన హాస్టల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. వినియోగదారులు హక్కులు బాధ్యతలు గుర్తెరగాలని తెలిపారు. వినియోగదారులు ఏ వస్తువు కొనుగోలు చేసినా తయారీ, ముగింపు తేదీలు చెక్ చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



కిట్లు అందజేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను డాక్టర్ బి.వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. 16 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎం.రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, టీబీ సూపర్‌వైజర్ రఫేల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ పాఠకులకు ఉద్యోగాలు..



లక్ష్మణ్



శ్రీలత

కొత్తగూడెంఅర్బన్: గ్రంథాలయంపై ఆధారపడి చదివిన విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఇటీవల విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పరీక్ష ఫలితాల్లో ఇద్దరు ఉత్తమ ఫలితాన్ని కైవసం చేసుకున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని పుస్తకాలను మూడేళ్లుగా చదువుతూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు రాష్ట్రస్థాయిలో 142వ ర్యాంకుతో జోనల్ స్థాయిలో 18వ ర్యాంకుతో ఓపెన్ కేటగిరిలో లక్ష్మణ్‌యాదవ్, రాష్ట్రస్థాయిలో 25 ర్యాంకుతో జోనల్ స్థాయిలో 35 ర్యాంక్‌తో ఓపెన్ కేటగిరీలో శ్రీలత ఉద్యోగం పొందారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి అర్జున్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల కృషి పట్టుదల అమోఘం అని వీరు ఉద్యోగం సాధించడం కొత్తగూడెం జిల్లా గ్రంథాలయకే గర్వకారణం అని, వీరు ఉద్యోగానికి పొందడానికి గ్రంథాలయంలో ఏర్పాట్లతో సహాయ సహకారాలు అందించిన గ్రంథ పాలకురాలు మణిమృదులకు ధన్యవాదాలు తెలిపారు. మూడేళ్లుగా గ్రంథాలయాన్ని వినియోగించుకున్నామని, గ్రంథపాలకురాలు సహాయ సహకారాలు అందించారని, వారి ప్రోత్సాహంతోనే ఉద్యోగం పొందినట్లు తెలిపారు.

ఇంటి పన్నులతోనే సరి..!

గ్రామపంచాయతీలు అంటే స్థానిక ప్రభుత్వాలు. ప్రభుత్వానికి ఉన్నట్లే గ్రామపంచాయతీకీ కొన్ని ఆదాయ వనరులు ఉంటాయి. ఇలా వచ్చిన ఆదాయంతో స్థానికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించే స్వేచ్ఛ పంచాయతీలకు ఉంటుంది. కానీ స్థానిక ప్రభుత్వానికి ఉండే హక్కులు, విధులను స్థానిక అధికారులే విస్మరించడం, ఉన్నతాధికారుల అవసరం లేదులే అన్నట్లుగా వ్యవహరించడం వంటి కారణాలు స్థానిక ప్రభుత్వాలు అన్న నామకరణాన్ని పలుచన చేస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

- మిగతా వనరులను విస్మరిస్తున్న జీపీలు
- ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారం
- మొక్కుబడి విధులకే పరిమితమైన స్థానిక ప్రభుత్వం



పోలారం గ్రామపంచాయతీ కార్యాలయం

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలలో 1998–99లలో ఇళ్ల వివరాలు రివిజన్ చేశారు. నిబంధనల ప్రకారం ప్రతీ ఐదేళ్లకోసారి ఇంటి పన్నుల జాబితాను రివిజన్ చేయాల్సి ఉంది. కానీ దీనిని ఉన్నతాధికారులు విస్మరించడంతో నేటికీ 1998–99 నాటి జాబితా ఆధారంగానే ఏటా పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన ఇల్లెందు మండలంలో ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో 14,064 ఇళ్ల నుంచి రూ.28,98,716 వసూలు చేస్తున్నారు. కానీ ఇటీవల నిర్వహించిన కులగణన సర్వే ప్రకారం మండలంలో ఉన్న ఇళ్లు అధికారికంగా 18,334. అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అధికారికంగా 4,270 ఇళ్లకు ఇంటి పన్నులు వసూలు చేయట్లేదని గణాంకాలు చెబుతున్నాయి.

సేవా పన్నుపై వీడని నిర్లక్ష్యం..

గ్రామపంచాయతీల విభజనకు ముందు ఇంటి పన్నుల రికార్డులు అస్తవ్యస్తంగా నిర్వహించిన కారణంగా ఇంటి నంబర్లు ఇష్టానుసారంగా కేటాయించారు. ఫలితంగా కేటాయించిన ఇంటి నంబర్లన్నీ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. గతంలో ఇంటి పన్ను చెల్లించిన రశీదులు ఉన్నా ఆన్‌లైన్ ప్రక్రియలో నమోదు కాని కారణంగా అటువంటి ఇళ్ల నుంచి పన్నులు వసూలు చేయడం లేదు. ఇలా ఒక్క ఇల్లెందు మండలంలోనే సుమారుగా మూడువేల వరకు ఇళ్లు ఉన్నట్లు పలు సందర్భాలలో అధికారికంగా నిర్వహించిన సర్వేలలో అధికారులు గుర్తించారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా వదిలేయడంతో అదికాస్తా ఇంటి పన్నుల ఆదాయంపై ప్రభావం చూపుతోంది. కానీ గ్రామపంచాయతీ ద్వారా ప్రతీ ఇంటికి సేవలు అందిస్తున్నందున ఇంటి నంబర్ లేని ఇళ్ల నుంచి మెమో నంబరు 512 ప్రకారం సేవా పన్ను పేరుతో పన్ను వసూలు చేయాలని నూతన పంచాయతీరాజ్ చట్టంలో ప్రభుత్వం పేర్కొంది. కానీ కేవలం నూతన ఇంటికి విద్యుత్ సౌకర్యం అవసరమైన సమయంలో అరకొరగా సేవా పన్ను వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శులు ఆ తరువాత కూడా ఆయా ఇళ్ల నుంచి సేవా పన్ను వసూలు చేయాలన్న నిబంధనను విస్మరిస్తున్నారు. ఫలితంగా ఏటా కేవలం సేవా పన్ను రూపంలో 4,270 ఇళ్ల నుంచి ఇంటికి కనీసం రూ.200 చొప్పున వసూలు చేసినా రూ.8.54 లక్షల ఆదాయాన్ని మండలం కోల్పోవాల్సి వస్తోంది.

కొలగారము ఊసే లేదు..

ఏదైనా గ్రామంలో పండిన పంటను వ్యాపారులు కాంటా పద్ధతిలో కొనుగోలు చేసినప్పుడు సంబంధిత గ్రామపంచాయతీకి కొలగారము (కాంటా రుసుము) కింద క్వింటాకు గ్రామపంచాయతీ తీర్మానం మేరకు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా కొలగారము వసూలు జాడే లేదు. వ్యవసాయ ఆధారిత మండలం కావడంతో ప్రతీ గ్రామ పంచాయతీలోనూ ఈ పద్ధతిలో నిధులు పన్నుల రూపంలో సమకూరే అవకాశం ఉంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం– 2018 కూడా పన్నుల వసూలుకు సంబంధించిన జాబితాలో కొలగారమును అగ్రభాగంలో పేర్కొంది. కానీ ఉన్నతాధికారులు మొదలు క్షేత్రస్థాయి అధికారుల వరకు ఎవరూ ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గ్రామపంచాయతీలలో ఇంటి పన్నుల తరువాత ఆ స్థాయిలో ఆదాయాన్ని అందించే కాంటా రుసుము, లైసెన్స్ ఫీజులు, చేపల చెరువుల వేలం, వారాంతపు సంత, జంతు వధశాలలు తదితర అనేక మార్గాలలో ఆదాయం సమకూరే అవకాశం ఉన్నా ఏఒక్కటీ అధికారులకు పట్టకపోవడం పంచాయతీ ఆదాయంపై తీవ్రంగా ప్రభావం చూపుతోంది.

ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే..

గ్రామపంచాయతీలు ఇంటి పన్నులను మాత్రమే ఆదాయ వనరుగా చూస్తూ ఇతరత్రా వనరులను విస్మరిస్తున్నారు. ఫలితంగా ప్రతీ పనికి ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడుతున్నారు. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేక స్థానిక ప్రభుత్వ హోదాను దిగజారుస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీలలో ఆదాయ మార్గాలపై సమీక్ష నిర్వహించి పూర్తిస్థాయిలో వసూలు చేస్తే పంచాయతీలు ఆర్థికంగా పరిపుష్టి ఉంటాయి.

దృష్టి సారిస్తాం..



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో ఇంటి పన్నులను నూరు శాతం వసూలు చేశాం. ఇతరత్రా ఆదాయ వనరులు ఉన్నప్పటికీ ఆ దిశగా దృష్టి సారించలేదు. భవిష్యత్‌లో వసూలు చేసేందుకు ప్రయత్నిస్తాం.

– చిరంజీవి, ఎంపీఓ, ఇల్లెందు

‘పది’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు





హాల్ టికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

ఇల్లెందురూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలను ఈ నెల 21వ తేదీ నుంచి పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ టీవీఆర్ఎస్ స్వామి తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం స్థానిక విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలో టీడబ్ల్యూఆర్, చల్లసముద్రం, రొంపేడు ఆశ్రమ పాఠశాల, మెయిన్ రోడ్డు, గరల్స్, సింగరేణి, జేబీఎస్ హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడు 1,119 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సీసీ కెమెరా పర్యవేక్షణలో ప్రశ్నపత్రాలను తెరుస్తారని, వీటిని పరీక్ష కేంద్రాల వారీగా అప్పగించేందుకు ఇద్దరు కస్టోడియన్లను నియమించామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి 12:30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఉదయం 8:30కే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సారి పరీక్ష విధానంలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ప్రతి పశ్నపత్రంపై క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుందని, పత్రాన్ని ఎక్కడికి తరలించినా వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈసారి పదో తరగతిలో గ్రేడింగ్ విధానం తొలగించి మార్కుల విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఫీజులు చెల్లించలేదని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్ ఇవ్వకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

టేకులపల్లి: రేపటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 2వరకు జరగనున్నాయి. ఇప్పటికే విద్యార్థులకు పరీక్షలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలను ఉపాధ్యాయులు తెలియజేశారు. హాల్ టికెట్లు కూడా అందజేశారు. టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షల ఏర్పాట్లను బుధవారం మండల విద్యాశాఖాధికారి అజ్మీర జగన్ నాయక్ పరిశీలించారు. మండలంలో మొత్తం 12 ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. మూడు పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ తెలిపారు. టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 180, సులానగర్ జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో 177, బోడు జెడ్పీ హైస్కూల్‌లో 88 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

ఆత్మస్థైర్యమే ఉజ్వల భవిష్యత్‌కు సోపానం



మాట్లాడుతున్న ఏటీడీఓ రాధ

ఇల్లెందురూరల్: ఆత్మస్థైర్యం కలిగి ఉన్న వ్యక్తి తన జీవితంలో ఉజ్వల భవిష్యత్‌ను పొందుతాడని ఏటీడబ్ల్యూఓ సూర్నపాక రాధ అన్నారు. బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షల పట్ల భయాన్ని వీడాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయం సాధించాలన్నారు. పాఠశాల జీవితాన్ని మధురస్మృతిగా మననం చేసుకుంటూ ప్రతీ విద్యార్థి ఉన్నతంగా చదివి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఐటీడీఏ ఏఈ సాలార్, డాక్టర్ బన్సీలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్లపై విద్యుత్ తీగలను మార్చండి..



ఏడీఈ కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఖమ్మం రోడ్డుకు ఇళ్ల మీదుగా ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించి మెయిన్ రోడ్డు లైన్‌కు మార్చాలని కోరుతూ న్యూడెమోక్రసీ నాయకులు బుధవారం ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాసుద్దీన్ మాట్లాడుతూ.. సుభాష్‌నగర్ ప్రాంతంలో ఇళ్ల మీదుగా 33 కేవీ విద్యుత్ లైన్ ఉండటం వల్ల గతంలో అనేక ప్రమాదాలు జరిగాయని, పలువురు మృత్యువాత పడ్డారని గుర్తుచేశారు. గాలిదుమ్ము వచ్చినప్పుడల్లా స్థానికులు భయాందోళనకు గురవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో రామిశెట్టి నర్సింహారావు, రాజు, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదాంల నిర్మాణానికి స్థలం కేటాయించండి..



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్ కొత్వాల, కనకేష్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాల్వంచ పీఏసీఎస్ పరిధిలో గోడౌన్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా బుధవారం డైరెక్టర్లతో కలిసి బుధవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సొసైటీ ద్వారా విత్తనాలు సరఫరా చేస్తుండడమే కాక ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. అయితే, సరైన గోదాంలు లేనందున స్థలాలు కేటాయిస్తే విత్తనాలు, ధాన్యం నిల్వలకే కాక గ్యాస్ గోదాంలు కూడా నిర్మిస్తామని చెప్పారు. వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రాం మోహన్‌రావు, కనగాల నారాయణ, చొగాని పాపారావు, జరబన సీతారాంబాబు, మైనేని వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి మధుసూదన్‌రావు, భూక్యా కిషన్, నిమ్మల సువర్ణ, సీతఈఓ లక్ష్మీనారాయణ, యర్రంశెట్టి ముత్తయ్య, పైడిపల్లి మహేష్, శాంతివర్ధన్ పాల్గొన్నారు.

అనుమతి నిరాకరించడం అప్రజాస్వామికం

సింగరేణి(కొత్తగూడెం): ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించబోయే సదస్సుకు యూనివర్శిటీ అధికారులు అనుమతి ఇవ్వకపోవడం అప్రజాస్వామికమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షురాలు సింధు బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ రాష్ట్ర యూనివర్సిటీల్లో కేంద్ర ప్రభుత్వ పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం నిర్వహించే సదస్సుకు అధికారులు సాకులు చెప్పటం శోచనీయమని తెలిపారు.

సింగరేణిలో పనివేళలు మార్చండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేసవికాలంలో పనివేళలు మార్చాలని జేఏసీ ఆధ్వర్యంలో జీఎం సివిల్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ... మార్చిలోనే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున సింగరేణిలో పనిచేస్తున్న అన్ని ఏరియాల్లో ఉన్న సివిల్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పనివేళలు మార్చాలని కోరారు. వీరికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విధులు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. అదేవిధంగా అన్ని విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు అందించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరారు. స్పందించిన జీఎం సమస్యను ఉన్నతాధికారులకు తెలియపరిచి వీలైనంత త్వరలో పరిష్కార మార్గం చూస్తామని హామీ ఇచ్చారు. మల్లెల రామనాథం, గడిపెల్లి కృష్ణప్రసాద్, పెద్దబోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎస్సై నాగుల్‌మీరా

ఇల్లెందురూరల్: యువత సమాజాభివృద్ధికి ఉపయోగపడేలా తమ జీవన శైలిని తీర్చిదిద్దుకోవాలని ఎస్సై నాగుల్‌మీరా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెడు స్నేహం చెడు అలవాట్లకు దారితీస్తుందని, స్నేహం జీవితానికి ప్రతిబింబంలా ఉండాలన్నారు. ప్రస్తుతం అనేక ప్రచార సాధనాల ద్వారా మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్నా కొంతమంది వాటికి బానిసలవుతున్నారని వాపోయారు. మాదకద్రవ్యాల కేసులో పట్టుబడితే శిక్షలు కఠినంగా ఉంటాయని గుర్తుచేశారు. సమాజ నిర్మాణంలో, యువత అభివృద్ధికి చదువే ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థి దశలో చదువుపై మనసు లగ్నం చేసి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ రాకేష్ శ్రీరాం, జి.శేఖర్, బి.సురేందర్, ఈశ్వర్, డాక్టర్‌రాజు పాల్గొన్నారు.

చదువే గొప్ప సంపద



జీఎం కోటిరెడ్డికి విద్యార్థుల వివరాలు తెలియజేస్తున్న హెచ్‌ఎం

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులకు చదువే గొప్ప సంపద. చదువును ఎవరూ దొంగతనం చేయలేరు. చదువు తల్లిదండ్రులు ఇచ్చిన సంపద కన్నా గొప్పదని, నేటి పోటీ ప్రపంచంలో అందరూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొత్తగూడెం ఏరియా ఎస్ఓటూ జీఎం జి.కోటిరెడ్డి అన్నారు. బుధవారం రామవరం 9వ వార్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తర గతి విద్యార్థులకు బెస్ట్ ఆఫ్‌లక్ చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాగా చదివి పదో తరగతి ఉత్తీర్ణత కావాలని, తల్లిదండ్రులను సంతోషపరచాలని కోరారు. హెచ్‌ఎం ప్రభుదయాళ్ మాట్లాడుతూ.. గత సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు 96శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈసారి నూరు శాతం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు నిర్మించాలని ఆందోళన

టేకులపల్లి: రెండేళ్లుగా నిర్మాణంలో ఉన్న రేగులతండా, దాసుతండా రహదారి నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం దాసుతండా వద్ద గ్రామస్తులు రోడ్డుపై టెంట్ వేసి నిరసన చేపట్టారు. కేటీసీకి వెళ్లే బొగ్గు లారీలను, అధికారుల వాహనాలను అడ్డుకున్నారు. బొగ్గు లారీల వల్ల దుమ్ము, ధూళి ఎగిసిపడి అనారోగ్యాల పాలవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం నీటిని పిచికారీ చేయడం లేదని మండిపడ్డారు. రోడ్డు నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రెండు గంటలకు పైగా ఆందోళన కొనసాగడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వచ్చి నచ్చజెప్పినా ఆందోళన విరమించలేదు. స్థానిక నాయకుల చొరవతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ ఫోన్‌లో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఏరియా స్ట్రక్చరల్ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): ఏరియా జీఎం కార్యాలయంలో బుధవారం ఏరియా లెవల్ స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏరియా జీఎం శాలేంరాజు హాజరయ్యారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు పలు డిమాండ్లను ఏరియా అధికారుల ముందుంచారు. వాటిలో ప్రధానంగా వీకే ఓసీ ప్రాజెక్ట్‌ను ప్రైవేట్ వారితో కాకుండా సింగరేణి యాజమాన్యమే నడిపించాలని, జేవీఆర్ ఓసీపీలో డంపర్లు, డోజర్లు, శవల్స్, గ్రేడర్స్ ఎస్కార్ట్ కాలం చెల్లాయని వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా పలు సమస్యలపై చర్చించారు. స్పందించిన జీఎం సమస్యలను వీలైనంత త్వరలో సమస్యలకు పరిష్కారమార్గం చూస్తామని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఇస్తానని హామీ ఇచ్చిన రూ.10 వేల వేతనంపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు రూ.3 వేలు వేతనం ఇస్తున్నారని, దీని ప్రకారం రోజుకు రూ.33 వేతనం అందించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని విద్యాశాఖ సూపరింటెండెంట్‌కు అందజేశారు. దొడ్డ రవికుమార్, కె.సత్య, డి.వీరన్న, భూక్యా రమేష్, నిమ్మల మధు, పిట్టల అర్జున్, జి.పద్మ, ఎస్‌డీ సుల్తానా, వెంకటనర్సమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): అసెంబ్లీ సమావేశాలలో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ఈ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆశా వర్కర్లు కలెక్టరేట్ ప్రధాన ద్వారం మూసివేసి ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే నడుస్తూ సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పిస్తామని, మెరుగైన సౌకర్యాలు సమకూరుస్తామని ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని దుయ్యబట్టారు. అసెంబ్లీ సమావేశాలలో ఆశాల సమస్యలపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

నష్టపరిహారం చెల్లించండి..



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నిర్వాసితులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): హైకోర్టు తీర్పు అమలు చేసి కోయగూడెం ఓసీ 2 భూనిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలని మాజీ ఎంపీ మిడియం బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మంచికంటి భవన్ నుంచి కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. బాబూరావు, రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వకపోవడం వల్ల 2011, 2024లో హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. రెండుసార్లూ నిర్వాసితులకు న్యాయం చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. వెంటనే అధికారులు నిర్వాసితులకు భూమి నష్ట పరిహారం, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.